

చిన్నచూపా..కక్ష సాధింపా..!
సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. గతంలో వలంటీర్లు చేసిన విధులన్నీ చేయిస్తూ రోడ్ల వెంట తిప్పుతున్నారు. - 8లో..



ఒక చేత్తో బైకులు..మరో చేత్తో గంజాయి
బైకులు చోరీ చేయడంతో పాటు గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
32/25

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

రేపు లీడర్షిప్ ట్రైనింగ్ ప్రారంభం

ఒంగోలు సిటీ: ఈ నెల 18 నుంచి 23 వ తేదీ వరకు ఆరు రోజుల పాటు లీడర్షిప్ ట్రైనింగ్‌ను పెదపరిమి, గుంటూరులో ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాశాఖాధికారులకు నిర్వహించనున్నట్లు డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రైనింగ్ కు కేటాయించిన ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలను ఉప విద్యాశాఖాధికారులు తప్పనిసరిగా రిలీవ్ చేసి పంపాలని డీఈఓ ఆదేశించారు. అలాగే ఈ ట్రైనింగ్ కు కేటాయించిన వారంతా 18వ తేదీ సోమవారం ఉదయం 7 గంటలకు హాజరు కావాలని డీఈఓ ఆదేశించారు.

ఏకేయూ ఏసీఈగా డాక్టర్ భారతీదేవి నియామకం



నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ అంచుల భారతీదేవి

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీ యూజీ విభాగం అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా అర్థశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డాక్టర్ అంచుల భారతీదేవి నియమించినట్లు ఏకేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు శనివారం తెలిపారు. ఏకేయూ వైస్ ఛాన్సలర్ ఛాంబర్‌లో వీసీ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి చేతుల మీదుగా అంచుల భారతీదేవి నియామక పత్రం అందుకున్నారు. గతంలో ఏసీఈ గా పనిచేసిన డాక్టర్ బి.పద్మజ ఆంధ్రకేసరి యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేటివ్ విభాగం హెచ్‌వోడీ గా కొనసాగనున్నారు.

18 వరకు అభ్యంతరాల స్వీకరణ


ఒంగోలు సిటీ: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టులకు సంబంధించి మెరిట్‌లిస్ట‌ను సమగ్రశిక్ష ఒంగోలు కార్యాలయం నోటీస్ బోర్డులో ఉంచారని, వీటికి సంబంధించిన అభ్యంతరాలను ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు స్వీకరిస్తారని డీఈఓ అత్తోట కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నోటిఫికేషన్ కు సంబంధించి సబ్జెక్టు వారీగా 1:3 అభ్యర్థులను ఎంపిక చేసినట్లు చెప్పారు. వాటిపై అభ్యంతరాలుంటే సమగ్ర శిక్ష జిల్లా కార్యాలయంలో తగిన ఆధారాలతో సమర్పించాలన్నారు.

యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్‌కు ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి యం.అంజల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 2 పాస్‌పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత పత్రాల నకళ్లు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పాన్ కార్డు, తదితర పత్రాల ఫొటోస్టాట్ కాపీలతో ఒంగోలు ప్రగతి భవన్‌లోని జిల్లా బీసీ సంక్షేమ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీలోపు దరఖాస్తు చేయాలన్నారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 27వ తేదీ ఎంపిక పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ఎంపిక పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు మెరిట్ ఆధారంగా విజయవాడలో ఉచిత శిక్షణ అందిస్తారన్నారు. బీసీలకు 66 శాతం, ఎస్సీలకు 22 శాతం, ఎస్టీలకు 14 శాతం రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తారన్నారు.

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఒంగోలు స్కిల్ హబ్ సెంటర్‌లో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 18వ తేదీ లోపు స్కిల్ హబ్ సెంటర్ ఒంగోలులో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ 3 నెలల పాటు జరుగుతుందన్నారు. 8వ తరగతి, ఆపైన పాసైన వారు అర్హులన్నారు. ఇతర పూర్తి వివరాలకు 7989244381 అనే నంబరు పై సంప్రదించాలన్నారు.



ఖాకీలపై పచ్చకక్ష

పోలీసు శాఖలో వారం రోజులుగా జరుగుతున్న బదిలీలు కాకపుట్టిస్తున్నాయి. సుదూర ప్రాంతాలకు ఇష్టానుసారంగా బదిలీ చేశారు. అధికార పార్టీ నేతలు ఇచ్చిన జాబితాల మేరకే బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీకి చెందిన ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను ఒక రాజకీయ పార్టీకి అనుకూలురనే ముద్ర వేసి వారిపై బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులు మండిపడుతున్నారు. పోలీసులపై రాజకీయ ముద్రలు వేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబాలను వదిలి దూరప్రాంతాలకు వెళ్లి విధులు నిర్వర్తించాల్సి వస్తుందని మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు.

- పోలీసు శాఖలో ఇష్టానుసారంగా బదిలీలు
- ఒక పార్టీకి అనుకూలురనే ముద్ర వేసి కక్షసాధింపు చర్యలు
- అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లతో సుదూర ప్రాంతాలకు పోస్టింగ్‌లు
- దూరప్రాంత బదిలీలపై పోలీసుల్లో తీవ్ర అసంతృప్తి
- ఆకస్మిక బదిలీలతో కుటుంబాలకు దూరమవుతామని ఆవేదన

ఒంగోలు టౌన్:

జిల్లా పోలీసు శాఖలో బదిలీల ప్రక్రియ ఇష్టానుసారంగా సాగుతోంది. రెండు రోజుల క్రితం గురువారం 12 మంది ఏఎస్ఐలను, 29 మంది హెడ్ కానిస్టేబుళ్లను జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లకు అటాచ్ చేస్తూ ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీ చేశారు. మరుసటి రోజు శుక్రవారం కూడా 33 మంది కానిస్టేబుళ్లను అటాచ్ పేరుతో బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఒంగోలు ప్రాంతంలో పనిచేసే ఉద్యోగులను గిద్దలూరు, రాచర్ల, కంభం, అర్ధవీడు, పుల్లలచెరువు లాంటి మారుమూల ప్రాంతాలకు బదిలీ చేశారు. మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెంలో పనిచేసే పోలీసు కానిస్టేబుళ్లను సింగరాయకొండ, కొండపి, మద్దిపాడు, తాళ్లూరులాంటి ప్రాంతాలకు బదిలీ చేశారు. అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు మార్చారు. ఈ బదిలీలను ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సహజంగా అయితే ఐదేళ్లు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బందిని బదిలీలు చేయాల్సి ఉంటుంది. బదిలీలు చేసే సమయంలో విల్లింగ్ అడగడం ఆనవాయితీగా వస్తోంది. విల్లింగ్‌లో భాగంగా ఒక్కొక్కరు మూడు పోలీసు స్టేషన్లను ప్రతిపాదించాలి. ఈ మూడు పోలీసు స్టేషన్లలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ పోస్టింగ్ ఇస్తారు. ఎవరినైనా పనిష్మెంట్ కింద బదిలీలు చేయాలనుకున్నప్పుడు మాత్రమే ఇలాంటి అటాచ్‌మెంట్ బదిలీలు చేస్తుంటారని పోలీసులు చెబుతున్నారు. అయితే ఇప్పుడు జరుగుతున్న బదిలీలన్నీ పనిష్మెంట్ బదిలీలుగా భావించాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండపి నియోజకవర్గానికి చెందిన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, బాపట్ల నుంచి ఇటీవల ఇక్కడకు వచ్చిన ఒక ఏఎస్ఐ, ఒంగోలుకు చెందిన ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటుగా ఒక స్పెషల్ బ్రాంచి హెడ్ కానిస్టేబుల్ ఈ బదిలీల్లో చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. వీరంతా అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీకి చెందిన ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లపై ఒక రాజకీయ పార్టీకి అనుకూలురనే ముద్ర వేసి వారిపై బదిలీ వేటు వేసినట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులు మండిపడుతున్నారు. పోలీసులపై రాజకీయ ముద్రలు వేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యాసంవత్సరం మధ్యలో ఇలా అర్ధంతరంగా బదిలీలు చేయడంతో కుటుంబాలు, చదువుకునే పిల్లలు ఎంత ఇబ్బంది పడతారన్నది ఆలోచించకుండా బదిలీలు చేయడం కేవలం కక్ష సాధింపు మాత్రమే అని వాపోతున్నారు. జిల్లా కేంద్రంలో పనిచేసేవారిని తీసుకెళ్లి ఎక్కడో మారుమూల ప్రాంతంలో వేశారని, పశ్చిమ ప్రకాశంలో పనిచేసే వారిని తీసుకొచ్చి జిల్లా కేంద్రంలో, ఒంగోలు చుట్టుపక్కల మండలాలకు బదిలీ చేశారని చెబుతున్నారు. ఇలా చేయడం పోలీసులను వృత్తిపరంగా ఇబ్బందిపెట్టడమే. ఇప్పుడు బదిలీలైన వారు వెంటనే ఫ్యామిలీతో వెళ్లే పరిస్థితులు లేవు. పిల్లల చదువులు, అనారోగ్యంతో ఉన్న కుటుంబ పెద్దలను తీసుకొని ఎలా వెళ్లాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. దాంతో కుటుంబాలకు దూరంగా ఒంటరిగా బదిలీ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. శాంతి భద్రతల్లో భాగంగా నిత్యం ఒత్తిడికి గురయ్యే పోలీసులను బదిలీల పేరుతో వేధించడం విచారకరం. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన సమయంలో సెట్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారని, ఇప్పుడిలా సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని పేరు చెప్పడానికి ఇష్టపడని కానిస్టేబుల్ ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు. మాకేమైనా సమస్య వస్తే ఎస్పీకి చెప్పుకుంటాం, ఆయనే బదిలీల పేరుతో ఇబ్బంది పెడుతుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు.

వెన్నాడుతున్న రోల్‌కాల్ భయం...

అర్ధంతరంగా బదిలీలు చేయడంతో పోలీసులు భార్యా బిడ్డలను ఇక్కడే వదిలేసి బదిలీ చేసిన చోటుకు వెళుతున్నారు. అలా వెళ్లిన వారు కనీసం వారానికి ఒకరోజైనా ఇంటికి వెళ్లే పరిస్థితులు లేవు. వీక్లీ హాఫ్‌లు లేవు. ఒకవేళ పర్మిషన్ తీసుకొని వెళ్లినా ఉదయం వెళితే సాయంత్రానికల్లా తిరిగి చేరుకోవాల్సి వస్తుంది. లేకపోతే రోల్‌కాల్‌కు హాజరుకావడం కష్టమవుతుంది. ప్రతిరోజూ ఉదయం గం.7.30 నుంచి గం.8 లోపు ఒకసారి, సాయంత్రం గం.5లకు ఒకసారి నిర్వహించే రోల్‌కాల్ కు హాజరుకాకుంటే ఆ రోజు గైర్హాజరు కింద పరిగణిస్తారు. ఒక కానిస్టేబుల్ సింగరాయకొండ నుంచి రాచర్లకు వెళ్లాలంటే కనీసం 4 గంటల సమయం పడుతుంది. రానుపోను 8 గంటలు ప్రయాణానికే సరిపోతుంది. ఇక ఇంటి దగ్గర ఉండేది ఎప్పుడు, కుటుంబ సభ్యులతో గడిపేది ఎంతసేపు. అంటే కుటుంబానికి పూర్తిగా దూరం కావలసి వస్తుందని బదిలీ అయిన పోలీసు సిబ్బంది వాపోతున్నారు. ఈ ఒత్తిడితో ఇక ఉద్యోగాలు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు.

బదిలీల్లో ఎమ్మెల్యేల పాత్ర...?

కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐల బదిలీల వెనక అధికార పార్టీ ఎమ్మెల్యే పాత్ర ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎమ్మెల్యేలు ఇచ్చిన లిస్టును కూడా పరిగణలోకి తీసుకున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ఒంగోలు, గిద్దలూరు నియోజకవర్గాల పరిధిలోని పోలీసులను మాత్రమే బదిలీ చేసినట్లు తెలుస్తోంది. గిద్దలూరు ఎమ్మెల్యే ఇచ్చిన జాబితా ప్రకారమే బదిలీలు చేశారని సమాచారం.

ఒంగోలు నియోజకవర్గంలో మాత్రం ఎమ్మెల్యేకి ఒక మాట చెప్పి చేసినట్లు తెలుస్తోంది. మొత్తం మీద బదిలీల లిస్టు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తయారైనట్టు చెప్పుకుంటున్నారు.

కార్యకర్తలను కాపాడుకుంటాం

- సమన్వయంతో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి
- ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తాం
- ఒంగోలు నియోజకవర్గంలో పార్టీ పునర్ వైభవానికి పనిచేస్తా
- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు



మాట్లాడుతున్న ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు

ఒంగోలు టౌన్: పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని, కార్యకర్తలు ఇబ్బంది పడకుండా ప్రతి ఒక్కరినీ కాపాడుకుంటామని ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన చుండూరి రవిబాబు అన్నారు. ఒంగోలు సమన్వయకర్తగా తనను నియమించినందున పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసుకొని మాట్లాడిన తరువాత అధికారికంగా బాధ్యతలు చేపట్టనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఉదయం దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా నిలబడతామని, పార్టీ నాయకులందరినీ కలుపుకొని సమన్వయంతో ముందుకు వెళతామన్నారు. ఒంగోలు నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటి వాటి పరిష్కారానికి పోరాటాలు చేస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వంటి ప్రజా నాయకులు చాలా అరుదుగా ఉంటారని, అటువంటి గొప్ప నాయకత్వంలో పనిచేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. తన మీద ఎంతో నమ్మకంతో పార్టీ బాధ్యతలు అప్పగించిందని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. తనకు సహకరించిన పెద్దలు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు.

చిరుద్యోగుల కడుపుకొట్టొద్దు..

పోలీసు శాఖలో జరుగుతున్న బదిలీల తీరు బాగా లేదని రవిబాబు అన్నారు. పోలీసుల మీద పార్టీ సానుభూతి ముద్రలు వేయడం తగదన్నారు. సామాజిక కోణంలో కిందిస్థాయి ఉద్యోగులపై కక్ష సాధింపులకు పాల్పడడం సమర్థనీయం కాదని హితవు పలికారు. అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా కానిస్టేబుళ్ల పట్ల కనికరం కలిగి ఉండాలని ఎస్పీని కోరారు. కానిస్టేబుళ్ల బదిలీలను ఆపాలని డిమాండ్ చేశారు. కార్పొరేషన్‌లో మేస్త్రీలను తొలగించడం, పారిశుద్ధ్య కార్మికులపై రాజకీయ వేధింపులకు పాల్పడడాన్ని ఖండించారు. బతుకు తెరువు కోసం చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే సామాన్యుల కడుపులు కొట్టడం అన్యాయమన్నారు. చిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దని, వారి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని కోరారు.

మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న మాట్లాడుతూ.. జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతగా పనిచేయాలని కోరారు. ఒంగోలు నియోజకవర్గంలో చుండూరి రవి నాయకత్వంలో పార్టీ విజయం సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి జగనన్న వెంట నడుస్తున్న చుండూరి నాయకత్వంలో నిబద్ధతగా పనిచేస్తామని నగర పార్టీ అధ్యక్షుడు కఠారి శంకర్ అన్నారు. కొత్తపట్నం మండలాధ్యక్షుడు లంకపోతు అంజిరెడ్డి మాట్లాడుతూ పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని అన్నారు. కొత్తపట్నం నుంచి చుండూరి రవికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ప్రభుత్వం పార్టీ నాయకులు, కార్యకర్తలను వేధిస్తుందని, వ్యాపారాలు చేసుకోకుండా ఇబ్బందులు పెడుతుందని చెప్పారు. అయినా అధికారపార్టీ బెదిరింపులకు భయపడి పారిపోయేది లేదన్నారు. ప్రభుత్వం చేసే అరాచకాలను ప్రశ్నించకుండా ఉండేందుకే సోషల్ మీడియా నోరు మూసేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని, ఇలాంటి నియంతృత్వ పోకడలు మంచివి కావని హెచ్చరించారు. సమావేశంలో కొత్తపట్నం జెడ్పీటీసీ సైకం లక్ష్మీ శారద, నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్ ఖాన్, 11వ డివిజన్ కార్పొరేటర్ గంగవరపు ప్రవీణ్ కుమార్, నాగూర్, బడుగు ఇందిర, షేక్ మీరావలి, వెంకటేశ్వర్లు (చిన్నా), ఓబుల్ రెడ్డి, సురేష్, సత్యనారాయణపురం బుజ్జి, తాతా నరసింహం గౌడ్, భూమిరెడ్డి రవణమ్మ, బత్తుల ప్రమీలా, వడ్లమూడి వాణి, కందూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే క్రియాశీల రాజకీయాలు...

చుండూరి రవిబాబు విద్యార్థి దశ నుంచే క్రియాశీల రాజకీయాల్లో పాల్గొన్నారు. టీడీపీలో వివిధ హోదాల్లో పనిచేశారు. 2004, 2009లో ఒంగోలు అసెంబ్లీ నుంచి టీడీపీ తరపున పోటీ చేసేందుకు ప్రయత్నించారు. ఆ తరువాత 2012లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన 2014లో సంతనూతలపాడు ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. 2019లో కందుకూరు నియోజకవర్గ పరిశీలకుడిగా, 2022-23లో పర్చూరు నియోజకవర్గ పరిశీలకుడిగా పనిచేశారు. రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్సార్ కాంగ్రెస్ చేపట్టిన అనేక పోరాటాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. అధికారంలోకి వచ్చినప్పుడు నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడ్డారు.

పిల్లల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా




మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: తమ పర్యవేక్షణలో ఉన్న పిల్లల ఆరోగ్య పరిరక్షణపై అంగన్‌వాడీలు మరింత దృష్టి పెట్టాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాలులో శనివారం బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న బంగారు బాలోత్సవాల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహ రహిత, బాల కార్మిక రహిత, అక్షర చైతన్య, ఆరోగ్యకరమైన ప్రకాశం జిల్లా ఆవిష్కరణ కోసం జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి పెట్టిందన్నారు. ఇందులో భాగంగా 18 ఏళ్లలోపు బాలలు ఆహ్లాదకర వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా పెరిగేలా వివిధ శాఖలను సమన్వయపరుస్తూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కమిటీలు నియమించామన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న అంగన్‌వాడీలపై గురుతర బాధ్యత ఉందన్నారు. అంగన్‌వాడీలోని పిల్లల ఆరోగ్యంపై మరింత దృష్టి పెట్టాలని దిశానిర్దేశం చేశారు. వయస్సుకు తగిన బరువు, ఎత్తు ఉంటున్నారో లేదో నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. వాస్తవ గణాంకాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. లోపంతో ఉన్న బాలలను గుర్తిస్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామ కమిటీల్లో అంగన్‌వాడీలను భాగస్వాములు చేశామన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, సీడీపీవోలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పదోన్నతులివ్వాలి

ఒంగోలు సిటీ: విద్యాశాఖలో అపరిష్కృతంగా ఉన్న పదోన్నతులను అర్హులైన వారందరికీ సీనియారిటీ ప్రకారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులు సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఒంగోలు విద్యాశాఖ కార్యాలయంలో పదోన్నతుల విషయమై డీఈఓ అత్తోట కిరణ్ కుమార్ ను కలిసి ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అన్ని విషయాలు పరిశీలించి త్వరలో అర్హులైన వారికి పదోన్నతులు కల్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పి.వరకుమార్, ఉపాధ్యక్షుడు మామిడి రమణారావు, కోశాధికారి ఈదర విజయభాను, టౌన్ అధ్యక్షుడు సి.తారక రామారావు, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఒంగోలు తాలుకా ఉపాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ కె.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనాత్మకంగా కవి సమ్మేళనం




కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు, సాహిత్యవేత్తలు

ఒంగోలు మెట్రో: విశ్వ కళాభారతి సంస్థ 23వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం రాత్రి జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిర్వహించిన కవి సమ్మేళనం ఆద్యంతం శ్రోతలను ఆకట్టుకుంది. సంస్థ అధ్యక్షుడు నాదెండ్ల జ్వాలా ఉమామహేశ్వర శర్మ నిర్వాహకులుగా వ్యవహరించారు. షేక్ నాగూర్ వలి, ఉమా దంపతులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభమైంది. అక్షర సాహితి అధ్యక్షుడు ఎంవీఎస్ శాస్త్రి సభాధ్యక్షత వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఆంధ్ర కేసరి కాలేజీ ప్రిన్సిపాల్ కోలగట్ల వెంకటేశ్వర రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులు సమాజంలోని రుగ్మతలపై తమ కవితలను వినించారు. భుక్త శేషం, యాచన, అప్పు చేయుట, చోరత్వం, జారత్వం, రోగం, దారిద్ర్యం, వృద్ధాప్యం అనే అంశాల మీద సాహితీవేత్తలు ఆళ్ల సుబ్బారెడ్డి, ధూపాటి రామాచార్యులు, ఉప్పలపాటి వెంకటరత్నం, పి.ఎం.కె ఆత్రేయ, నెమ్మాని సీతారామమూర్తి, పుల్లూరి మాతయ్య, రావినూతల వరలక్ష్మి, మానేపల్లి నాగ కుమార శర్మ పద్య, వచన రూపంలో కవిత్వాన్ని వినిపించారు.

మధ్యాహ్న భోజనం అధ్వానం

- విద్యార్థులకు రుచిలేని భోజనం పెడుతున్నారు
- బాలికలను మహిళా ఉపాధ్యాయులే అసభ్యకరంగా తిడుతున్నారు
- ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



మోటుమాల కేజీబీవీలో భోజనం తిని చూస్తున్న బత్తుల పద్మావతి

కొత్తపట్నం: విద్యార్థులకు రుచిలేని భోజనం వండిపెడితే ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలు ఎలా వస్తారని ఉపాధ్యాయులపై ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం అల్లూరు, కొత్తపట్నం, మోటుమాల కేజీబీవీ పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. ముందుగా అల్లూరు హైస్కూల్‌లో సందర్శించినప్పుడు విద్యార్థునులు పాఠశాలకు కొంచెం ఆలస్యంగా వచ్చినప్పుడు జీవశాస్త్ర ఉపాధ్యాయుని వారిని అసభ్యకరమైన పదజాలంతో తిడుతున్నారని, మేము మానేస్తామని విద్యార్థినులు వాపోయారు. గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు విద్యార్థులపై చేసుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు తమ బోధన పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. విద్యార్థులను కొట్టి, తిట్టి, ఒత్తిడి తీసుకొచ్చి చదువు నేర్పించడం మంచి పద్ధతి కాదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిప్యూటీ డీఈవోను ఫోన్‌లో ఆదేశించారు. అల్లూరు హైస్కూల్‌లో 170 మంది విద్యార్థులుంటే 25 కేజీల బియ్యం వండాల్సి ఉండగా, 12 కేజీల బియ్యం ఎలా సరిపోతాయని హెచ్ఎం సుబ్బారావును ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి 150 గ్రాముల చొప్పున భోజనం వండిపెట్టాలని స్పష్టం చేశారు. కోడిగుడ్లలో కూడా తేడాలు ఉన్నాయని చెప్పారు. కొత్తపట్నం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. అల్లూరులో ఒక రకంగా, కొత్తపట్నంలో మరో రకంగా మెనూ ఉందని ఇందులో ఏది నిజమని ఎంఈవో-1 తులసీ కుమార్‌ని వివరం అడిగారు. కొత్తపట్నం హైస్కూల్లో బియ్యం స్టాక్ పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌కు, స్టాక్‌కు పొంతన లేదని హెచ్ఎం శ్రీదేవిని వివరణ అడిగారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థునులతో భోజనాన్ని తిని చూశారు. ముద్దలాగా ఉన్న అన్నం, నీళ్ల పప్పు వండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రుచికరమైన భోజనం అందించడం లేదని, ఇలా భోజనం తయారు చేస్తే డ్రాపౌట్ అవుతారని అన్నారు. ప్రతి పాఠశాలలో పరిష్కారాల పెట్టె ఏర్పాటు చేయాలని ఇన్‌చార్జి ఎస్‌వో అరుణను ఆదేశించారు. రుచికరమైన భోజనం అందించడం లేదని తేలిందని, వీటిపై సమగ్ర నివేదిక అందించాలని కోరారు. అనంతరం బంగారు బాల్యం, బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో 1, 2 తులసి కుమారి, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలకు బిర్యానీ తీసుకొని వస్తూ ఆగిన తల్లి గుండె



విజయలక్ష్మి మృతదేహం

ఒంగోలు టౌన్: పిల్లలకు బిర్యానీ తీసుకొని వస్తుండగా ఆ తల్లి గుండె ఆగిపోయింది. పోలీసుల కథనం ప్రకారం... కొత్తపట్నం మండలం ఈతముక్కల గ్రామానికి చెందిన బడుగు విజయలక్ష్మి కొత్త ఇంటి ప్రవేశం సందర్భంగా పిల్లలకు బిర్యానీ తీసుకొచ్చేందుకు వెళ్లింది. బిర్యానీ తీసుకొని వస్తుండగా ఈతముక్కలపాడు వెంకటాద్రి బంకు దగ్గరకు రాగానే ఒక్క సారిగా రోడ్డు మీద కూలబడిపోయింది. వెంటనే ఆమెను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఒంగోలు జీజీహెచ్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించడంతో అక్కడ నుంచి ఒంగోలు తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఈతముక్కలపాడుకు తరలించారు. అయితే ఒంగోలులోని గద్దలగుంటకు చెందిన విజయ లక్ష్మి తల్లిదండ్రులు తమ కూతురి మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆమె మృతదేహాన్ని మార్చురీలో ఉంచారు.

చిన్నచూపా.. కక్ష సాధింపా..?

- సచివాలయ ఉద్యోగులను వేధిస్తున్న కూటమి ప్రభుత్వం
- గతంలో వలంటీర్లు చేసిన విధులన్నీ చేయిస్తూ రోడ్ల వెంట తిప్పుతున్న వైనం
- తీవ్ర ఒత్తిడి, అవమానాలకు గురవుతున్న ఉద్యోగులు
- పింఛన్ల పంపిణీతో మొదలై.. పాఠశాలల మరుగుదొడ్ల యాప్‌లో నమోదు
- ఇంటింటికీ స్టిక్కర్లు, కరపత్రాల పంపిణీ..
- తాజాగా ఇంటింటికీ జియో ట్యాగింగ్ సర్వే
- గత ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందడమే మేం చేసిన పాపమా అంటూ ఉద్యోగుల ఆవేదన


కనిగిరిలోని వార్డు సచివాలయం

జిల్లాలోని మండలాలు **38**

సచివాలయాలు **719**

సచివాలయ ఉద్యోగులు **7,909** (సుమారు)

కనిగిరి రూరల్: సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. రోజురోజుకూ చిన్నచూపు చూస్తూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు చేసిన విధులన్నింటినీ ప్రస్తుతం సచివాలయ ఉద్యోగులతో చేయిస్తూ ప్రతిరోజూ వారిని రోడ్ల వెంట తిప్పుతోంది. గత ప్రభుత్వంలో ఇంటింటికి తిరిగి సేవలందించేందుకు వలంటీర్లు ఉండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వలంటీర్లు ఉంటారని, జీతాలు కూడా పెంచుతామని ఎన్నికల సమయంలో చెప్పిన చంద్రబాబు.. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా పట్టించుకోకుండా వలంటీర్లను నిలువునా మోసం చేశారు. వలంటీర్ల విధులన్నింటినీ సచివాలయ ఉద్యోగులతో చేయిస్తున్నారు. దీంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి, అవమానాలకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలుత పింఛన్ల పంపిణీని సచివాలయ ఉద్యోగులతో చేయించారు. ఆ తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పరిశుభ్రతపై రోజు మార్చి రోజు పరిశీలన చేసి యాప్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని అప్పగించారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై.. ఇది మంచి ప్రభుత్వం అనే పేరుతో కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటికి తిరిగి స్టిక్కర్లు, కరపత్రాలు పంపిణీ చేయించారు. తాజాగా మళ్లీ ఇంటింటికి తిప్పి జియో ట్యాగింగ్ సర్వే చేయిస్తున్నారు. జియో ట్యాగింగ్ సర్వేలో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను వినిపించుకోకుండా.. చేయాల్సిందే అంటూ ప్రభుత్వం వేధిస్తుండటంతో సచివాలయ ఉద్యోగులు నలిగిపోతున్నారు. టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారుల నుంచి వస్తున్న ఒత్తిళ్లకు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ చూపి సచివాలయ ఉద్యోగులుగా ఎంపికైన తమతో ఇలాంటి పనులు చేయించడం ఏంటని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. కేవలం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు పొందడమే మేము చేసిన పాపమా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువలనే కూటమి ప్రభుత్వం తమను చిన్నచూపు చూస్తూ కక్ష సాధిస్తోందని, ఈ ఉద్యోగంలోకి ఎందుకు వచ్చామా అని బాధ వేస్తోందని దిగులు చెందుతున్నారు.

జియో ట్యాగింగ్‌తో తీవ్ర ఇబ్బందులు...

ప్రస్తుతం కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ జియో ట్యాగింగ్ సర్వే పనుల్లో నిమగ్నమయ్యారు. ఎంప్లాయిస్ మొబైల్ అప్లికేషన్ పేరిట వచ్చిన యాప్‌లో ప్రతి ఇంటిని ఫొటో తీసి జియో ట్యాగింగ్ చేసి ఆధార్ నంబర్ అప్‌లోడ్ చేయాలి. ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా టార్గెట్లు ఇచ్చారు. సర్వే సమయంలో గృహ యజమాని తప్పనిసరిగా బయోమెట్రిక్ లేదా ఫేసియల్ అథెంటికేషన్ ఇవ్వాలి. దీనిపై ప్రజలకు పలు అనుమానాలు రేకెత్తుతూ వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జియో ట్యాగింగ్ సర్వేకు ప్రజలెవరూ సహకరించడం లేదు. దీనికితోడు కొన్నిసార్లు నెట్‌వర్క్ పనిచేయక, సిగ్నల్స్ లేక యాప్ ఓపెన్ కావడం లేదు. దీంతో సచివాలయ ఉద్యోగులు పడే అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. అలాగే బయోమెట్రిక్ హాజరు పేరుతో వేతనాల్లో కత్తెర వేస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఉన్న తమపై ఎందుకీ వివక్ష అంటూ మనోవేదన చెందుతున్నారు.

ఒక చేత్తో బైకులు.. మరో చేత్తో గంజాయి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

- ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ దామోదర్

ఒంగోలు టౌన్: ఒక చేత్తో బైకులు కొట్టేస్తూ.. మరో చేత్తో గంజాయి విక్రయిస్తూ ఎడాపెడా దోపిడీలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను శనివారం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ వెల్లడించారు. గత కొద్ది రోజులుగా ఒంగోలు నగరంలో వరుసగా బైకుల దొంగతనాలు జరుగుతుండటంతో పోలీసులు నిఘా పెట్టారు. స్థానిక సీఎస్ఆర్ శర్మ కాలేజీ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తున్నట్లు అందిన సమాచారంతో శుక్రవారం సాయంత్రం వన్‌టౌన్ సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి వెళ్లారు. పోలీసులను చూసిన ఆగంతకులు పారిపోయేందుకు ప్రయత్నించారు. దాంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గంజాయి విక్రయిస్తున్నట్లు తెలిసింది. వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో మోటారు బైకుల దొంగతనాల విషయం బయటపడింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు. కందుకూరు పట్టణంలోని బండపాలేనికి చెందిన కుంచాల శివప్రసాద్ ప్రస్తుతం హైదరబాద్‌లోని చందానగర్‌లో నివాసం ఉంటున్నాడు. కందుకూరు మండలంలోని దూబగుంట గ్రామానికి చెందిన ఉప్పు శ్రీకాంత్, ఒంగోలులోని కొణిజేడు బస్టాండు వద్ద నివాసం ఉంటున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన సహౌద్దిన్ సర్దార్‌తో కలిసి జిల్లాలో 15 మోటారు బైకులు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. అంతేగాకుండా బాపట్ల జిల్లాలో 1, పల్నాడు జిల్లాలో 1, నెల్లూరు జిల్లాలో 16 మోటారు బైకులను దొంగతనం చేసినట్లు తెలిపారు. మొత్తం 33 మోటారు బైకుల విలువ రూ.25,80,000 కాగా, వారి నుంచి రూ.26 లక్షల చోరీ సొత్తును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనాల దొంగలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ఏఎస్ఐలు సురేష్, నాయబ్ రసూల్, హెడ్ కానిస్టేబుళ్లు ఎం.సాయి, విజయకుమార్, కానిస్టేబుల్ అనిల్‌ను ఎస్పీ అభినందించారు.

వన్‌టౌన్ పోలీసు స్టేషన్ తనిఖీ...

వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ దామోదర్ తనిఖీ చేశారు. స్టేషన్ స్థితిగతులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. పోలీసు స్టేషన్లో ఏర్పాటు చేసిన మ్యాప్‌ను పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాల గురించి అడిగి తెలుసుకున్నారు. రాత్రివేళల్లో ముమ్మరంగా గస్తీ నిర్వహించాలని, 112 కాల్స్‌పై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ నాగరాజు ఉన్నారు.

క్రీడా స్ఫూర్తి అలవరచుకోవాలి


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్పీ దామోదర్


పరుగు పందెంలో పాల్గొన్న మహిళా పోలీసులు


వాలీబాల్‌లో తలపడుతున్న పోలీస్ జట్లు

- పోలీసులకు ఎస్పీ దామోదర్ పిలుపు
- జిల్లా పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2024 ప్రారంభం

ఒంగోలు టౌన్: పోలీసులంతా క్రీడా స్ఫూర్తి అలవరచుకోవాలని, గెలుపోటములను పట్టించుకోకుండా క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొనాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా పోలీసు గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్–2024ను ప్రారంభించారు. ప్రారంభ వేడుకల్లో బెలూన్లు ఎగురవేశారు. గత స్పోర్ట్స్ మీట్‌లో వ్యక్తిగత చాంపియన్‌షిప్ సాధించిన కాటం శ్రీను క్రీడా కాగడాను ఎస్పీకి అందజేయగా, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్‌ను 16, 17 తేదీల్లో వ్యక్తిగత, జట్టు విభాగాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్, షటిల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, క్రికెట్ ఆటలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. క్రీడల్లో ప్రత్యర్థులు అనే మాటకు తావులేదన్నారు. ఏడాదిలో 365 రోజులు పనిలో ఒత్తిడిని అధిగమిస్తూ విధులు నిర్వర్తించే పోలీసులకు క్రీడలు ఊరటనిస్తాయన్నారు. మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. సమన్వయం, సమయస్ఫూర్తి ఉంటేనే విజయం సాధించడం సులువవుతుందన్నారు. క్రమశిక్షణ అలవరచుకునేందుకు క్రీడలు దోహదపడతాయని చెప్పారు. క్రీడలకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, ఎస్బీ డీఎస్పీ సురేష్‌బాబు, ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ, మార్కాపురం డీఎస్పీ నాగరాజు, సీఐలు, ఆర్ఐలు పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న పోలీసులు


షాట్‌పుట్ విసురుతూ...


పరుగు పందెంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది

అంగన్‌వాడీలకు అన్యాయం చేస్తున్నారు



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ నాయకులు

- ప్రభుత్వ తీరుకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా

ఒంగోలు టౌన్: అంగన్‌వాడీ మినీ వర్కర్లతో రాష్ట్ర ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటూ సెలవులు, వేతనాలు సక్రమంగా ఇవ్వకుండా అన్యాయం చేస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ బాధ్యతలను ఒక్క మినీ వర్కర్ చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. యాప్‌లు, ఎఫ్ఆర్ఎస్, ఈకేవైసీలతో మారుమూల గ్రామాల్లో సిగ్నల్ అందక అంగన్‌వాడీలు చాలా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. అంగన్‌వాడీ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్న కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోవడం దారుణమన్నారు. మినీ వర్కర్లకు సెలవులు ఇవ్వడం లేదని, సమాన వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. వేతనాల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం దాటవేత వైఖరి అవలంబించడం శ్రామిక మహిళల పట్ల టీడీపీ నిర్లక్ష్య వైఖరిని తెలియజేస్తోందన్నారు. అంగన్‌వాడీల పట్ల ఇదే వైఖరి అవలంబిస్తే మరో చారిత్రాక పోరాటానికి సిద్ధమవుతామని సీఐటీయూ జిల్లా నాయకుడు రాయళ్ల మాలకొండయ్య హెచ్చరించారు. మినీ వర్కర్ల సమస్యలు పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని స్పష్టం చేశారు. యూనియన్ నాయకురాలు కె.సుబ్బమ్మ అధ్యక్షత వహించిన ధర్నాలో యూనియన్ నాయకులు ఎస్.ధనలక్ష్మి, మున్నా, జయప్రద, సౌజన్య, డి.పద్మావతి, రమాదేవి పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో నిధులు, సిబ్బంది కొరత పరిష్కరిస్తాం

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: గ్రంథాలయాల్లో నిధులు, సిబ్బంది కొరత పరిష్కరించేందుకు కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. గ్రంథాలయాల్లో సమస్యలపై సాక్షి దినపత్రికలో ఈ నెల 15వ తేదీ 'సమస్యల గ్రంథం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని గ్రంథాలయ సంస్థలో నిధుల కొరత ఉందని పౌర గ్రంథాలయ సంచాలకులకు లేఖ పంపడం జరిగిందన్నారు. ఉత్తర్వులు వచ్చిన తర్వాత గ్రంథాలయ వారోత్సవాలకు బడ్జెట్ విడుదల చేస్తామన్నారు. గ్రంథాలయ సంస్థలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ మూతపడకుండా ఉండటం కోసం వారంలో రెండు రోజులు గ్రంథాలయాలు తెరుస్తున్నామన్నారు. మిగిలిన రోజుల్లో స్వీపర్‌తో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు గ్రంథాలయం తెరుస్తున్నామన్నారు. 105 పోస్టులకుగానూ 35 మంది విధులు నిర్వహిస్తున్నారని, 70 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 15 మందికిగానూ 11 మంది పనిచేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు రాగానే పోస్టులు భర్తీ చేస్తామని తెలిపారు.

క్లుప్తంగా

బీసీల స్వయం ఉపాధికి రుణాలపై సమావేశం

ఒంగోలు వన్‌టౌన్: బీసీల స్వయం ఉపాధికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి రుణాల మంజూరుపై బీసీ సంఘ నాయకులతో స్థానిక బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ కార్పొరేషన్ అధికారి ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మొత్తం 50 రకాల యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసేందుకు నిర్ణయించిందన్నారు. టైలరింగ్, ఆటోలు, బ్యూటీ పార్లర్, సెలూన్లు, షీప్ యూనిట్లు, సిమెంట్ బ్రిక్స్ యూనిట్లను లబ్ధిదారులు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. 50 శాతం బ్యాంక్ రుణాలు, 50 శాతం సబ్సిడీ అందించనున్నట్లు తెలిపారు. ఓబీఎంఎంఎస్ పథకం ద్వారా ఈ రుణాలు అందిస్తామన్నారు. సమావేశంలో పలువురు బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అటెండర్ మృతి


మృతిచెందిన షేక్ ఖాసీం

కురిచేడు: రోడ్డు ప్రమాదంలో తహసీల్దార్ కార్యాలయ అటెండర్ షేక్ ఖాసీం (56) మృతిచెందిన సంఘటన కురిచేడు మండలంలోని పొట్లపాడు సమీపంలో గల చప్టా వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న ఖాసీం విధి నిర్వహణ అనంతరం మోటారు సైకిల్‌పై ఇంటికి వెళ్తూ చప్టాపై ఉన్న గుంతలో వాహనం పడి అదుపుతప్పి పక్కనున్న కంకర కుప్పపైకి ఎక్కి కిందపడిపోయాడు. దీంతో అతని తలకు బలమైన గాయమై రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఇటీవలే దొనకొండ నుంచి కురిచేడు వచ్చిన ఖాసీం మృతికి తహసీల్దార్ రజనీకుమారి, రెవెన్యూ సిబ్బంది సంతాపం తెలిపారు.

క్రీడా ఫలాలను సద్వినియోగం చేసుకోవాలి

- విద్యార్థులకు ఏకే విశ్వవిద్యాలయం వీసీ మూర్తి పిలుపు


పోటీలను ప్రారంభిస్తున్న ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తి

ఒంగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి క్రీడా ఫలాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డీవీఆర్ మూర్తి పిలుపునిచ్చారు. శనివారం యూనివర్శిటీ కాలేజీ ఆవరణలో యూనివర్శిటీ పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో నైపుణ్యాలు ప్రదర్శించి పేరు ప్రఖ్యాతులు గడించాలని సూచించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ పరిధిలోని క్రీడాకారులకు యూనివర్శిటీ తరఫున ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమని, ప్రతి ఒక్క విద్యార్థి క్రీడా ఫలాలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరఫున క్రీడల్లో రాణించి పతకాలు సాధించిన క్రీడాకారులకు చదువుకు సంబంధించి 25 శాతం మార్కులను బోనస్‌గా ఇవ్వడం జరుగుతుందన్నారు. అదే సమయంలో ఉత్తమ క్రీడాకారులకు ఆంధ్రకేసరి యూనివర్శిటీ తరఫున స్పోర్ట్స్ స్కాలర్‌షిప్పులు కూడా అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు విద్య, ఉద్యోగ రంగాలలో కోటాను 2 నుంచి 3 శాతానికి పెంచిందన్నారు. అనంతరం జరిగిన జూడో పోటీలకు ఐయూటీ సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఉలవపాడు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గంటా సాయి సురేష్, డాక్టర్ బి.రమేష్‌బాబు, తదితరులు వ్యవహరించారు. ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా పోటీలు జరగ్గా, వివిధ విభాగాలలో విజేతలైన క్రీడాకారులకు వీసీ ప్రొఫెసర్ మూర్తి చేతుల మీదుగా పతకాలు అందజేశారు. కార్యక్రమంలో ఏకేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రాజమోహన్‌రావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దేవీవరప్రసాద్, జూడో అధ్యక్షుడు ఖాజా, సీడీసీ డీన్ ప్రొఫెసర్ జి.సోమ శేఖర, వ్యాయామ విద్య విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి స్వల్పగాయాలు


మృతుడు పోలా రాజా


ఘటన స్థలంలో పడి ఉన్న మృతుడు రాజా, క్షతగాత్రురాలు వెంకటరమణ


ఢీకొట్టిన వాహనం

పామూరు: ఎదురెదురుగా వచ్చిన బొలేరో వ్యాన్, మోటార్ సైకిల్ ఢీకొని ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్రగాయాలు, ఒకరికి స్వల్ప గాయాలైన సంఘటన పామూరు మండలంలోని గుమ్మనంపాడు జంక్షన్ వద్ద 565 జాతీయ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పాదిలి చిన్నచెరువుకు చెందిన పోలా రాజా తన భార్య వెంకటరమణ, ఇద్దరు కుమారులతో కలిసి బైక్‌పై పామూరులో బంధువుల ఇంట్లో ఓ చిన్నారి జన్మదిన వేడుకలకు వెళ్తున్నారు. గుమ్మనంపాడు జంక్షన్‌లో 565 జాతీయ రహదారి టర్నింగ్ వద్ద పామూరు నుంచి కనిగిరి వైపునకు వైద్యశాలల్లోని వ్యర్థాలతో వెళ్తున్న బొలేరో వ్యాన్ ఎదురుగా వచ్చి రాజా కుటుంబం వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న పోలా రాజా (25) తల ఒకవైపు పూర్తిగా నుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చుని ఉన్న అతని భార్య వెంకటరమణ కాలు విరగ్గా, వారి కుమారుడు ఆశీర్వాదంకు కూడా కాలు విరిగింది. చిన్న కుమారుడు మహిపాల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు వెంకటరమణ, ఆశీర్వాదంలను 108లో ఒంగోలు జీజీహెచ్‌కి తీసుకెళ్లారు. మృతుడి తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఏఎస్సై ముల్లా ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం రాజా మృతదేహాన్ని కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.